## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

**తెనాలి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల సంరక్షణ కోసం తీసుకొచ్చిన డిజిటల్ బుక్ జగనన్న 2.0 పోస్టర్‌ను సోమవారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా పార్టీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో కోరారు.

### నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాకు ఘననివాళి



**తెనాలి:** నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతిని స్థానిక గుర్రం జాషువా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషను దగ్గర్లోని జాషువా విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, ఘనంగా నివాళులర్పించారు. జాషువా సాహిత్య సేవను, సమాజ చైతన్యానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. విజ్ఞాన సమితి అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్, కార్యదర్శి పినపాటి రవికుమార్, కోశాధికారి వేజండ్ల రత్నం, కనపర్తి డేవిడ్, ఇందుపల్లి రాజారామ్, పేరిపోగు రాజగోపాల్, కనపాల రాజేంద్రప్రసాద్, నలుకుర్తి సద్గుణరావు, కొండముది రమేష్, లక్ష్మణకుమార్, ఆరమళ్ల శ్రీనివాస్, చిలక సుధాకర్‌బాబు, సీహెచ్ భాస్కరరావు, కె.లక్ష్మణరావు, లంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కనక దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి మనోహర్



**తెనాలిటౌన్:** రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాంక్షించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయానికి ఆదివారం రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి పూజలు నిర్వహించి మంత్రికి వేద ఆశీర్వచనం చేశారు. సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, రాఘవేంద్ర, అర్చకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### నిత్యావసరాలు పంపిణీ

**తెనాలిరూరల్:** మండలంలోని అంగలకుదురు గ్రామంలో పేదలకు నిత్యావరాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన విన్సెంట్ డి పాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమాన్ని చేపట్టారు. నిత్యావసరాలను అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ ఇమ్మానియేల్, రాజమోహన్, పి.బాల్స్వామి, పొన్నెకంటి సామియేలు, సిరిపురం బాలస్వామి, ఎన్.రవిబాబు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

**దుగ్గిరాల:** రైలుపేట పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి సహస్ర నామార్చన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

**తాడికొండ:** రాజధాని ఇక్కడే అని ఆమోద ముద్ర వేయించుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఏఆర్ఎస్ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌ను నిరసిస్తూ ఆయన చేస్తున్న రిలే దీక్షలు ఆదివారంతో 91వ రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ భూములిచ్చి 12 ఏళ్లు దాటినా రైతులకు ఒక్క ప్లాటు కూడా అభివృద్ధి చేసి ఇచ్చిన దాఖలాలే లేకపోవడం దుర్మార్గమన్నారు. అమరావతి పేరుతో రాజకీయ డ్రామాలు ఆడుతున్న అన్ని పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా తీసుకెళతామన్నారు.

### జొమాటో కార్మికుల నిరసన ర్యాలీ

**లక్ష్మీపురం:** జొమాటో కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శని, ఆదివారాలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి రెండో రోజుకు చేరింది. సమ్మెలో గుంటూరు నగరంలో పని చేస్తున్న జొమాటో కార్మికులు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుంటూరు అంబేడ్కర్ సర్కిల్(లాడ్జి సెంటర్)లో నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఈ.క్రాంతి రణదేవ్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకట్, వాల్మీకి, బెస్తాని నాగేశ్వరరావు, దుర్గారావు, రామారావు, షేక్ అబ్దుల్లా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



శ్రీప్రత్యంగిరాదేవిగా దర్శనమిచ్చిన వాసవీ అమ్మవారు



వారాహీమాతగా దేవీచౌక్‌లోని రాజరాజేశ్వరిదేవి..



పాత శివాలయంలో చండికాదేవి అలంకారం



నందివెలుగులో సంతానలక్ష్మీ దేవి అలంకరణలో..



కొల్లిపరలో కాళికాదేవిగా అమ్మవారు

# భక్తజన రంజకం

దసరా పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాల్లో శ్రీదేవీ శరన్నరాత్రి మహోత్సవాలు భక్తజన రంజకంగా కొనసాగుతున్నాయి. ఏడోరోజైన ఆదివారం ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రిళ్లు విద్యుత్ వెలుగులతో శోభిల్లుతున్న ఆలయాల్లో సాంస్కృతిక ప్రదర్శనల సందడి నెలకొంటోంది. - తెనాలి /తెనాలిటౌన్ /కొల్లిపర



రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతీ దేవస్థానంలో..



కరెవరంలో శ్రీ మహాచండీదేవిగా..

# ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేయొద్దు

**చిరంజీవిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలపై కాపునేతల నిరసన**



నిరసన నినాదాలు చేస్తున్న కాపు నేతలు

**తెనాలి:** దేవాలయం లాంటి రాష్ట్ర శాసనసభలో మెగాస్టార్ చిరంజీవి నుద్దేశించి తోటి నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కాపు నేతలు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ 11వ వార్డుకు చెదిన కాపు నేత కఠారి హరీష్ ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలోని మూడు బొమ్మల సెంటర్లో స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన నినాదాలు చేశారు. సినీ పరిశ్రమలో వివాదరహితుడైన చిరంజీవిపై సాక్షాత్తూ అసెంబ్లీలో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయటం సమంజసం కాదని హరీష్ అన్నారు. ఒకప్పుడు సినీరంగంలో ఎన్టీఆర్ తిరుగులేని నటుడుగా గుర్తింపును పొందారని చెబుతూ, ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషితో అగ్రనటుడిగా ఎదిగినట్టు గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వంచే అత్యున్నత పురస్కారాన్ని స్వీకరించినట్టు చెప్పారు. చిరంజీవి గొప్ప నటుడు మాత్రమే కాకుండా పరిశ్రమలో అందరివాడుగా, సహృదయమైన వ్యక్తిత్వం కలిగిన వారని చెప్పారు. అలాంటి వ్యక్తిపై 'ఎవడు' అంటూ బాలకృష్ణ వ్యాఖ్యలు చేయటం తమలాంటి ఎందరికో బాధగా ఉందన్నారు. రక్తసంబంధీకులైన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబులు కూడా బాలకృష్ణ వ్యాఖ్యాలపై స్పందించాలని కోరారు.

- కాపు నాయకుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే కాపు కులంపై కుట్ర జరుగుతున్నట్టుగా భావించాల్సి వస్తోందన్నారు. చిరంజీవిని మాత్రమే కాకుండా తన పేరు తొమ్మిదో స్థానంలో చేర్చారంటూ కాపు వర్గానికి చెందిన మంత్రి కందుల దుర్గేషను కూడా బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా విమర్శించారని గుర్తుచేశారు.
- కాపు నేత బూరెల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వంగవీటి రంగా హత్యానంతరం జరిగిన ఉద్యమం గుర్తుచేసుకుంటే, కాపుల శక్తి తెలుస్తుందని చెప్పారు. అందరం కలసిమెలసి వుంటున్న రాష్ట్రంలో కులాలమధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా ఎవరూ వ్యవహరించరాదని అన్నారు తొట్టెంపూడి నాగరాజు తన ప్రసంగంలో, సందర్భం లేని వ్యాఖ్యలతో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయొద్దని సూచించారు. కాపు నేతలు బచ్చు రాఘవరావు, కోడూరి శివయ్య, అమిరిశెట్టి కొండలు, సాయి, ఐనంపూడి చంద్రశేఖర్, పసుపులేటి రాము, మామిడిబత్తుల శ్రీను, రాయపూడి శ్రీను, కాళహస్తి భవాని, కన్నెగంటి ఫణికుమార్, నాగరాజు, సుంకర విశ్వేశ్వరరావు, చళ్లగుళ్ల సాంబశివరావు పాల్గొన్నారు.

## వినూత్న, ఉదాత్త సేవలకు 'మానవత' శ్రీకారం



మాస్టర్ అథ్లెట్ మల్లికార్జునరావుకు సత్కారం



దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం, నగదు బహూకరణ

**తెనాలి:** ప్రముఖ స్వచ్ఛంధ సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ వినూత్నమైన ఉదాత్త సేవలకు శ్రీకారం చుట్టింది. మాస్టర్ అథ్లెటిక్స్‌లో బంగారు పతక విజేత స్థానిక చినరావూరుకు చెందిన 92 సంవత్సరాల శాఖమూరి మల్లికార్జునరావును సత్కరించింది. దివ్యాంగులైన పిల్లలను ఉన్నతులను చేయాలనే తపనతో ఎంతో కష్టపడుతున్న వారి తల్లిదండ్రులకు నగదు పారితోషికాన్ని అందజేసి, అభినందించింది. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశం ఇందుకు వేదికయింది. తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. వివరాలను ముత్తేవి రవీంద్రనాథ్, మల్లాది అర్జున తెలియజేశారు. వృత్తిరీత్యా నాలుగు దశాబ్దాలపాటు సైక్లింగ్ చేసిన మల్లికార్జునరావు రిటైరయ్యాక గుంటూరు స్టేడియంలో అథ్లెటిక్స్‌లో సాధన చేసి, ఆరు రాష్ట్రాల్లోని 14 నగరాల్లో జరిగిన పోటీల్లో పలు పతకాలను సాధించారు. తన జీవిత విశేషాలను సత్కారగ్రహీత వివరించారు. అనంతరం దివ్యాంగులైన నార్ల శివానీ (బీకాం ఫైనలియర్), షేక్ తమీన్ (బీకాం సెకండియర్), చీమకుర్తి చందు, షేక్ ఖాదిర్ ((బీఎస్సీ ఫైనలియర్) తల్లిదండ్రులను సత్కరించి మానవత తరపున ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదును బహూకరించారు. స్పందించిన ఈవీఎల్‌వీ అప్పారావు దంపతులు కూడా రూ.5 వేల వంతున నగదును ఇవ్వగా, కొత్త సుబ్రహ్మణ్యం, ఎంఎల్ జగదీశ్వరాంబ, మన్నె సత్యనారాయణ దంపతులు, ఆలపాటి వెంకట్రామయ్య, హరిప్రకాష్‌లు ఒక్కొక్క విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.వాసు, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కోశాధికరి ఎస్‌వీ శర్మ, కార్యవర్గసభ్యులు మొవ్వా సత్యనారాయణ, యు.సూర్యనారాయణ, పి.మల్లిఖార్జునరావు, కె.నాగేశ్వరరావు, ఆర్.భుజంగరావు, సంధ్యారాణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### '100'పై అవగాహన అవసరం

**ఫిరంగిపురం:** వేములూరిపాడులో ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వుల మేరకు ఆదివారం 100, 112 కాల్ నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసినట్లయితే తక్షణం పోలీసుల నుంచి సాయం అందుతుందన్నారు. ప్రజలు అవగాహన పెంచుకుని పోలీసుల నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### తాడేపల్లిలో కంట్రోల్ రూం

**తాడేపల్లి రూరల్:** భారీ వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కృష్ణానదిలో 6.5 లక్షల క్యూసెక్కుల నీరు చేరుకుందని, లోతట్టు ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇది 24 గంటలూ పని చేస్తుందని, సోమ, మంగళ, బుధ వారాల్లో కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏదైనా అవసరమైతే 87903 96195 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

**తాడేపల్లి రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కార్మికులకు నారా లోకేష్ హామీ ఇచ్చారని దాన్ని నెరవేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నవనీతం, సూర్య ప్రకాష్, ఖాసిం, ఆదినారాయణ, దాన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# లీకులు.. తిప్పలు!

**ఆర్‌ఆర్ నగర్‌లో రక్షిత మంచినీటి పైపు లైన్లకు లీకులు**



నడి రోడ్డులో పైపు ఏర్పాటు చేయడంతో పగిలిపోయి దానిలో నుంచి వస్తున్న నీరు

**తెనాలిఅర్బన్:** డాక్టర్ రావి రవీంద్రనాథ్ నగర్‌లో రక్షిత మంచినీటి పైపులైన్ల లీకులు ఎక్కువయ్యాయి. 2వ లైన్‌లో నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన పైపు పగిలిపోవడంతో దానిలో నుంచి నీరు బయటకు వస్తుంది. అలాగే అదే నీరు మరో పైపులో నుంచి ఇళ్ల ట్యాపులకు వెళ్తుండటం ఆందోళన కలిగిస్తుంది. అదే రోడ్డులో జెండా చెట్టు సమీపంలో నాలుగు చోట్ల పైపులు లీకై నీరు వృథాగా పోతుంది. దీంతో ఆ ప్రాంతం అంతా నీటితో నిండిపోతుంది. చెంచుపేటలోని వాటర్ ట్యాంక్ అధ్వానంగా తయారైంది. దాని కింద నీరు నిలిచి పాచి పట్టి దుర్గంధ భరితంగా మారింది. ప్రజలకు మంచినీటి సరఫరా చేసే ట్యాంకు వద్దే ఇలాంటి పరిస్థితి ఉందంటే అధికారులు ఏ మేరకు వీటి నిర్వాహణపై శ్రద్ధ చూపుతున్నారో అర్థమవుతుంది. డయేరియా, కలరా ప్రబలుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేయడంతో పాటు కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పైపుల్లో నుంచి బయటకు వస్తున్న మంచి నీరు



చెంచుపేట వాటర్ ట్యాంకు కింద పాచి పట్టిన నీరు

### 200 మందికి వైద్య పరీక్షలు

**చెరుకుపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిచటం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ లన్నారు. మండలంలోని గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శివప్రసాద్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి మండలం నలుమూలల నుంచి వచ్చిన 200 మందికి యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బెల్లంకొండ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్ కుమార్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగు సూచనలు అందించారు.

### పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. కొత్తపేటలోని గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో వెయ్యి మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, 4000 నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు ఆదివారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు పాల్గొన్నారు.

## వాసవీ మాతను దర్శించుకున్న శివకుమార్



బతుకమ్మ వేడుకల్లో కమిటీ సభ్యులతో శివకుమార్ దంపతులు

**తెనాలి:** దసరా పర్వదినం సందర్భంగా జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విస్తృతంగా పాల్గొంటున్నారు. పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న పూజల్లో శనివారం రాత్రి సతీమణి పుష్పతో కలిసి ఆయన పాల్గొన్నారు. వాసవి మాతను దర్శించుకున్నారు. ఆశీర్వచనం అందుకున్నారు. పక్కనేగల శ్రీరమాసహిత శ్రీసత్యనారాయణ స్వామిని దర్శించుకున్న అనంతరం అదే ప్రాంగణంలోని గీతామందిరానికి వెళ్లారు. అక్కడ జరుగుతున్న బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ పెద్దలు మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, మద్దాళి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, మాలేపాటి హరిప్రసాద్, తొమ్మంద్రు మణిదీప్, చంద్రమోహన్, ఇడవలపాటి వాసు, జూటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వేద పారాయణ ఎంతో పవిత్రం

**టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ శివసుబ్రహ్మణ్య అవధాని**



వేదపారాయణ చేస్తున్న పండితులు

**తెనాలి:** వేద పారాయణ అనేది హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైనదని, అది ఒక ధార్మిక ఆచార బంధమైనదని, తద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ బ్రహ్మశ్రీ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని చెప్పారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం నాజరుపేటలోని వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య భవనంలో బ్రహ్మశ్రీ సామవేదం సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద పారాయణ నిర్వహించారు. ఘనాపాటి విష్ణుభట్ల ఆంజనేయ చైనులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శివసుబ్రహ్మణ్య అవధాని మాట్లాడుతూ వేద పారాయణ ప్రాముఖ్యతను తెలియజేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య కృషిని ఆయన అభినందించారు. సత్యనారాయణ మాట్లాడుతూ వేదపారాయణను గురువు మార్గదర్శకంలో చేస్తే గొప్ప ఫలితాలు లభిస్తాయన్నారు. మొత్తం 50మంది వేద పండితులు వేద పారాయణ చేశారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి పర్యవేక్షణలో పండితులను సన్మానించారు. సమాఖ్య ప్రతినిధులు కుందేటి సుబ్రహ్మణ్యం, తిరుమలరావు, కామేశ్వరరావు, నారాయణం వేణుగోపాల్, అనిల్ కుమార్, మేడూరి శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, పానుగుపాటి వెంకటేశ్వర్లు, టి.నాగసుబ్రహ్మణ్యం, తాడేపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

## పాదాల గాయాల చికిత్సపై అవగాహన



అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ గోగినేని ఉమ

**తెనాలిరూరల్:** ఇండియన్ పోడియాట్రి అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయలలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులలో వచ్చే కాళ్ల పుండ్లు, పాదాల గాయాలు వాటి చికిత్స, ఆధునిక శస్త్ర చికిత్సల గురించి వైద్య నిపుణులు వివరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ జి. మధుప్రభాకర్, ఐపీఏ కార్యదర్శి డాక్టర్ మనోహర్షా గన్నెన, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ ఉదయ్ చందు, డాక్టర్శ్రీ హర్ష, డాక్టర్ కొమ్మినేని జగదీష్, గోగినేని రమేష్, డాక్టర్ గంటా నరసింహారావు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ జీవీ సుబ్బారావు, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ గుత్తి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల నూతన కమిటీ ఎంపిక చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సలహా మండలి సభ్యుడు మందాళ వీరారెడ్డి తదితరులు

**పెదకాకాని:** పూర్వ విద్యార్థుల కమిటీ ఎంపిక చట్ట విరుద్ధమని సలహామండలి సభ్యుడు మందాళ వీరారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం చట్ట విరుద్ధంగా చేసిన రహస్య ఎంపికను ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాల గేటు ముందు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మందాళ వీరారెడ్డి మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలసి తాత్కాలికంగా అడహాక్ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అదే సంవత్సరంలో మూడు రోజుల పాటు ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడం జరిగిందని, ఈ వేడుకలకు సుమారు రూ.34 లక్షలు ఖర్చు కాగా ఇంకా రూ.11 లక్షలు బ్యాంక్ బ్యాలెన్స్ ఉందని అన్నారు. ఆ తరువాత ప్లాటినం జూబ్లీ వేడుకలకు గుర్తుగా గ్రామంలో చందాలు వసూలు చేసి రూ.52 లక్షలతో పాఠశాలలో నూతన భవనం నిర్మించడం జరిగిందని తెలిపారు. 600 మంది శాశ్వత కమిటీ సభ్యులు ఉండగా ఈ నెల 26వ తేదీన రహస్యంగా కోరం కూడా లేకుండా కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీ ఎంపిక చట్ట విరుద్ధమని, కమిటీ రెన్యువల్ కూడా జరగలేదని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు, పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయం, బ్యాంక్‌కు చట్టపరంగా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కోటి రూపాయలు ఖర్చు చేసిన కమిటీ లెక్కలు చెప్పకుండా, నకిలీ రశీదులు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు సయ్యద్ సుభాని, నంబూరు కిషోర్, గుజ్జుల బసంతి, శనగల శివమ్మ, వుయ్యూరు ముత్తారెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరదనీటిలో పంట పొలాలు



పల్లంగా ఉన్న పొలాల్లోకి చేరుతున్న వరద నీరు

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్, మంగళగిరి రూరల్, దుగ్గిరాల మండలాల్లో కృష్ణానదీ తీరంలో కరకట్ట లోపల పంటపొలాలు ఆదివారం వచ్చిన వరదనీటికి నీట మునిగాయి. కృష్ణానది తీర ప్రాంతంలో ఉన్న పంటపొలాలు అధిక వర్షాల కారణంగా ఒకసారి పంట దెబ్బతినగా రైతులు తిరిగి మళ్లు పంటలను ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు. కృష్ణానది ఎగువ ప్రాంతంలో అధిక వర్షాలు కురియడంతో ప్రకాశం బ్యారేజీ వద్దకు 6 లక్షలకు పైగా వరద నీరు వచ్చి చేరడంతో 70 గేట్లను ఎత్తి వరద నీటిని కిందకు వదులుతున్నారు. గుండిమెడ శివారులోను, చిర్రావూరు, రామచంద్రాపురం, గొడవర్రు తదితర ప్రాంతాల్లో లోతట్టులో ఉన్న పంట పొలాలతో పాటు లంక భూములు పూర్తిగా నీటిలో మునిగాయి. ఆయా ప్రాంతాల్లో పసుపు, కంద, చేమ, బెండ, వంగ, దొండలతో పాటు క్యాలీఫ్లవర్, ఇతర పంటలను పండిస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన వరదకు పంటపొలాల్లో మొక్కలు 70 శాతం నీట మునిగిపోయాయని, వరద ఉధృతి పెరిగితే పంట పూర్తిగా నీట మునిగి నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నియోజకవర్గ వ్యాప్తంగా 150 ఎకరాల వరకు మునిగి ఉండవచ్చని అంచనా.